క్లుప్తంగా

అద్దంకి దయాకర్‌ను కలిసిన సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌అర్బన్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌ను జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ సోమవారం కలిశారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలకు హాజరై మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని పరిస్థితులు, కాంగ్రెస్ అనుకూల అంశాలపై చర్చినట్లు సాజిద్ ఖాన్ తెలిపారు.

ఆంగ్లంపై అవగాహన

ఆదిలాబాద్‌అర్బన్: పోటీ పరీక్షల ఆంగ్లంపై విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు ఆర్.దేవేందర్‌రావు పోటీ పరీక్షల ఆంగ్ల ఆవశ్యకతను వివరించారు. త్వరలో నెల రోజుల పాటు ఉచిత ఆంగ్ల సర్టిఫికెట్ కోర్సును కళాశాల తృతీయ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బోధించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జలగం అనిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవులను ఆక్రమిస్తే చర్యలు

బోథ్: అడవులను ఆక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని బోథ్ రేంజ్ అటవీశాఖ అధికారి గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్లతో దున్నడం, బోర్లు వేయడం, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, విద్యుత్ సరఫరాను ఏర్పాటు చేయడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

విద్యారంగానికి పెద్దపీట



డైనింగ్‌హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్ మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. అనంతరం నూతనంగా నిర్మించిన డైనింగ్‌హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సమత, ఆర్‌సీవో గోపిచంద్ రాథోడ్, సర్పంచ్ వెంకన్న, రఘు, శ్రీధర్ రెడ్డి, ధనుంజయ్ పాల్గొన్నారు.

సబ్ మార్కెట్‌యార్డు పరిశీలన



సౌకర్యాలపై ఆరా తీస్తున్న చైర్మన్ సునీల్

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డును జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గోడం వర్ష సునీల్ సోమవారం పరిశీలించారు. త్వరలో శనగ కొనుగోళ్ల ప్రారంభం కావడంతో కాంటాల మరమ్మతులు, విద్యుదీకరణ, తాగునీరు వసతులపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెల 2నుంచి శనగ కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి కాంబ్లే మధుకర్, సర్పంచ్ ఇంద్రశేఖర్, డైరెక్టర్ సాదిక్ పాల్గొన్నారు.

దీక్ష విజయవంతం

ఉట్నూర్‌రూరల్: రైతు సురక్ష సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రైతు భరోసా దీక్ష విజయవంతమైందని నాయకులు తెలిపారు. సోమవారం రైతు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో సురేశ్‌కు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు బొర్రన్న, దూట రాజేశ్వర్, అరికిల్ల అశోక్, రవి జాదవ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

'అడవుల్లోకి వెళ్లొద్దనడం సరికాదు'

బోథ్: అడవుల్లోకి వెళ్లి వ్యవసాయం చేయవద్దని బోథ్ అటవీ అధికారులు ఇచ్చిన ప్రకటన పట్ల కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అడవులను నమ్ముకుని గిరిజనులు బతుకుతున్నారని, పోడు భూములపై ఇప్పటికే ప్రభుత్వానికి అర్జీలు పెట్టుకున్న తరుణంలో ఇలాంటి ప్రకటనలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పాము కలకలం

తాంసి: మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయం సమీపంలో సోమవారం పాము సంచారం కలకలం రేపింది. ఒక్కసారిగా పాము కనిపించడంతో సిబ్బంది భయాందోళన చెందారు. స్థానికుల సాయంతో పామును చంపేయడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. పంటచేల నుంచి కార్యాలయాలలోకి పాములు వస్తున్నాయని మండల పరిషత్, ఐకేపీ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

చెరువు నీరు వృథా



ఏడారిని తలపిస్తున్న తాంసి చెరువు

- నీరు నిలవదు.. పంట పండదు
- మరమ్మతుకు నోచుకోని తాంసి చెరువు
- తగ్గుతున్న భూగర్భ జలాలు
- ఆందోళనలో రైతులు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రాజెక్టులు, చెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణానికి అధికంగా నిధులను కేటాయించి పనులు చేపడుతోంది. గ్రామ శివారులో గతంలో నిర్మించిన చెరువుల మరమ్మతుల కోసం నాలుగేళ్ల క్రితం వరకు మిషన్ కాకతీయ ద్వారా నిధులు కేటాయించి పనులు చేపట్టారు. తాంసి మండల కేంద్రంలోని చెరువుకు 15 ఏళ్ల నుంచి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో నీరు నిల్వ ఉండక, పంటలు ఎండుతున్నాయి. వరదనీరు లీకేజీ ద్వారా బయటకు వెళ్తుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పథకంలో కూడా పూడికతీత, మరమ్మతులకు నోచుకోలేదు. ప్రతి ఏటా జనవరిలోనే ఖాళీఅవుతుంది.

450 ఎకరాల ఆయకట్టు..

తాంసి గ్రామ చెరువుకు 450 ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ ఎకరం కూడా పంటలు పండించ లేని దుస్థితి నెలకొంది. గతంలో చెరువు నిర్మాణ సమయంలో పంటచేన్ల గుండా నిర్మించిన కుడి, ఎడమ కాలువలు దెబ్బతిన్నాయి. కుడి కాలువ 6 కిలోమీటర్లు, ఎడమ కాలువ 3.5 కిలోమీటర్లు ఉంటుంది. నిర్వహణ సరిగా లేకపోవడంతో కాలువలు పూడుకుపోయాయి. వరదల ద్వారా చెరువులోకి నీరు పుష్కలంగా వస్తున్నా.. కాలువల నిర్మాణం సరిగా లేక పలుచోట్ల లీకేజీ ఉండడంతో నిల్వ ఉండడం లేదు. కట్టపై చెట్లు ఏపుగా పెరగడంతో పగుళ్లు ఏర్పడ్డాయి.

మరమ్మతు చేయించాలి



చెరువు నీటితో గత కొన్నేళ్ల క్రితం పంటలు సాగు చేశాం. ఇప్పుడు నీరు లేకపోవడంతో క్రీడా మైదానాన్ని తలపిస్తోంది. పంటచేలలో బోరుబావులు సైతం పని చేయడం లేదు. అధికారులు చెరువుకు మరమ్మతులు చేపట్టాలి.

– చిన్న రాంరెడ్డి, రైతు

లీకేజీలు అరికట్టాలి



చెరువు ఉన్న రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండడం లేదు. వర్షాపు నీరు నిల్వ ఉండడం లేదు. త్వరగా లీకేజీలు అరికట్టి చెరువులో నుంచి నీరు బయటకు వెళ్లకుండా చూడాలి. కాలువలకు మరమ్మతులు చేయిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– రాథారపు విఠల్, రైతు

అడుగంటుతున్న భూగర్భ జలాలు..

చెరువులో నీరు నిల్వ ఉండకపోవడంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. చెరువు నీటిపై ఆధారపడి పంటలు పండిస్తే ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి చెరువుకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

'ప్రభుత్వాలను గద్దె దించాలి'



కాలనీవాసులతో మాట్లాడుతున్న నగేష్

ఆదిలాబాద్‌అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ అన్నారు. మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న హాథ్ సే హాథ్ జోడోయాత్ర సోమవారంతో ఎనిమిదో రోజుకు చేరుకుంది. కుమురం భీం కాలనీలో పర్యటించి, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎలాంటి అభివృద్ధి ఫలాలు అందుతాయో ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతతత్వ ఆలోచన ఉన్న కేంద్ర ప్రభుత్వాన్ని తగిన బుద్ధి చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం, ఇంటికో ఉద్యోగం, దళితబంధు, రుణమాఫీ హామీలిచ్చి మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ గోవర్ధన్ రెడ్డి, వసీమ్, మోతీరాం, రాజు, కవిత, గంగమ్మ, హనీఫ్, ఫాయిమ్, శివాజీ, గౌస్ పాల్గొన్నారు.

ప్రజా చైతన్యానికే 'ప్రజాగోస.. బీజేపీ భరోసా'



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: బీఆర్ఎస్ చేస్తున్న మోసాలపై ప్రజలను చైతన్యం చేసేందుకే ప్రజా గోస.. బీజేపీ భరోసా కార్యక్రమానికి చేపడుతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీలో సోమవారం రాత్రి నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. తెలంగాణ కుటుంబ పాలనలో సాగుతుందని, అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జోగు రవి, విజయ్ బోయర్, మయూర్ చంద్ర, ఆకుల ప్రవీణ్ జ్యోతి రెడ్డి, ధోని జ్యోతి, రాము పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగాపూర్‌లో బీజేపీ స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌ను సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కేంద్ర పభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండేరి రమేశ్, వాసు, సునీల్, ముకుంద్‌రావు పాల్గొన్నారు.

హీరాసుక్క జయంతి విజయవంతం చేయండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దుర్వా నగేశ్

అదిలాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో మంగళవారం ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే గోండి ధర్మ గురు హీరాసుక్క జయంతిని విజయవంతం చేయాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దుర్వా నగేశ్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. అదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ గోడం నగేశ్, నిజామాబాద్ జెడ్పీ చైర్మన్ విఠలేశ్వరరావు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోడం గంగారాం, పరశురాం, భరత్, వామన్, పాండురంగ, విట్టల్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థినులతో ప్రత్యేకాధికారి

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని అర్బన్ కేజీబీవీ విద్యార్థినులు కరాటేలో ప్రతిభ కనబర్చారు. ఎనిమిది మంది విద్యార్థినులు గోల్డ్ మెడల్స్ సాధించగా, మరో ఆరుగురు సిల్వర్ మెడల్స్ సాధించి సత్తా చాటారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని చాంపియన్ కరాటే పాఠశాలలో ఆదివారం కరాటే పోటీలు నిర్వహించారు. కావేరి మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో విద్యార్థినులు మెడల్స్ సాధించారని కేజీబీవీ ప్రత్యేకాధికారి సీహెచ్.దీప్తి తెలిపారు. గోల్డ్ మెడల్స్ సాధించిన వారిలో పి.సౌజన్య, ఎం.లక్ష్మి, జి.శ్రీనిధి, ఎ.పూజ, బి.అనుష్క, జి.తనూష, కె.వైష్ణవి, పి.రిషిత ఉండగా, సిల్వర్ మెడల్స్ సాధించిన వారిలో టి.అక్షర, కె. నిఖిత, ఎం.సుజాత, ఆర్.నేహ, ఎ.ధనశ్రీ, ఎస్.పూజతాయ్ ఉన్నారు.

'అక్షరజ్యోతి' పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న

బోథ్: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో అక్షరజ్యోతి కార్యక్రమాన్ని ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఐటీడీఏ పీవోతో మాట్లాడి ప్రహరీ నిర్మాణం చేపడుతామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భీంరావ్, సోలంకి సత్యనారాయణ, సంతాబాయి, సీఆర్‌టీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై కంజూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతకు ముందు జిల్లా అదనపు కలెక్టర్ నటరాజ్ చేతుల మీదుగా వినియోగదారుల అవగాహన పోస్టర్ ఆవిష్కరించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, రామగిరి హరిబాబు, శివకుమార్, నగేష్, రాజేష్, కిరణ్‌కుమార్, గడుగు గంగన్న, షేక్ ఇర్ఫాన్, మల్లేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

ఆదిలాబాద్‌అర్బన్: తెలంగాణ ప్రభుత్వ ప్రజారోగ్య వైద్యుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌ను తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, వామన్‌రావు, సత్యనారాయణ, బ్రహ్మానందరెడ్డి, రమణచారి, రమేష్, మహేందర్, ప్రమోద్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి) పంచాయతీ పరిధిలోని రఘూగుడలో సోమవారం సర్పంచ్ అడవ్ మారుతి సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాన్‌పట్టె శివాజీ, వార్డు సభ్యులు జంగుబాబు, గ్రామ పటేల్ భీంరావు పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ యార్డులో కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి నవీన్‌రెడ్డి కంటి అద్దాలు, మందులను సోమవారం పంపిణీ చేశారు. కంటివెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాన్ని కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారత లక్ష్మి, జహీద, తుక్కరెడ్డి రాజేందర్ రెడ్డి, రాజు, సుమంగళ, స్నేహ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత

బోథ్: ఇటీవల జరిగిన శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా మండలంలోని సొనాల గ్రామంలో నవనిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. రక్తదానం చేసిన దాతలకు రిమ్స్ ఆసుపత్రి వారు అందించిన ప్రశంసా పత్రాలు సోమవారం అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కోశెట్టి శుద్ధోధన్, సభ్యులు పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

ఎదులాపురం: పట్టణంలోని కొత్త కుమ్మరివాడలో సోమవారం ఆవు మృతి చెందగా గోమతా సేవా ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేష్, జగన్, సాయికృష్ణ, పృథ్వి రాజ్, రాజశేఖర్, రాజరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తలమడుగు: మండలంలోని భరంపూర్ గ్రామంలో సోమవారం బీసీ సంక్షేమ సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాడురి రమాకాంత్, ప్రధాన కార్యదర్శిగా కత్తెర్ల శశికాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బెల్లపు వినోద్, ప్రచార కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా గణేశ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్, సి.నర్సిహులు, సలహాదారులుగా స్వామిని ఎన్నుకున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

తలమడుగు: మండలంలోని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఖోడద్ కాంప్లెక్స్ హెచ్ కుష్ణకుమారి అన్నారు. సోమవారం మండలంలోని లింగి, కుచులపూర్, ఖోడద్ జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభ, హెచ్‌ఎం, హెచ్‌ఎంసీ చైర్మన్‌లు వెంకన్న, కల్యాణం రాజేశ్వర్ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి డబ్బాలు అందజేత

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాలకు నీటి డబ్బాలను అందజేశారు. గ్రామానికి చెందిన సంతోష్, కృష్ణవేణిల కుమారుడు సాయిక్రిష్ణ జ్ఞాపకార్థం హెచ్‌ఎం శ్రీకాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వామి, గ్రామస్తులు కపిల్, విశాల్ పాల్గొన్నారు.

'బెంగాలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి'



కలెక్టర్‌కు విన్నవిస్తున్న సామ రూపేష్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలంలో వైద్యం చేస్తూ.. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న బెంగాలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఆదివాసీ, అమాయక ప్రజలకు వైద్యం చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి మోకాళ్లకు ఇంజెక్షన్లు వేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు వారి వద్ద నుంచి మామూళ్లు తీసుకుంటున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్.. నిర్మాణం పూర్తయ్యేనా?



నేరడిగొండ: మండలంలోని బుద్ధికొండ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీని నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- అధికారి పేరు: మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, నేరడిగొండ, ఫోన్: 91001 41227

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



మౌనం పాటిస్తున్న వైద్య సిబ్బంది

బోథ్: మెడికో విద్యార్థి ప్రీతి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుమేర్ పాషా, టీజీవీపీ అధ్యక్షుడు ప్రవీణ్, లంబడా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్‌లు డిమాండ్ చేశారు. టీజీవీపీ ఆధ్వర్యంలో బోథ్ బస్టాండ్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

గుడిహత్నూర్: వేధింపులకు గురి చేసిన సీనియర్ విద్యార్థి సైఫ్‌పై చర్యలు తీసుకోవాలని మండల అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఇందులో ఎంపీపీ భరత్, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఆడే సునీల్, రాథోడ్ రమేష్, మల్యాల కరుణాకర్, జాదవ్ విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వానిదే బాధ్యత

ఆదిలాబాద్‌టౌన్: ప్రీతి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. సోమవారం రిమ్స్ మెడికల్ కళాశాల ఆవరణలో ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, జోగు రవి, దినేష్ మటోలియా, మహేందర్, విజయ్, మయూర్‌చంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: స్థానిక పోలీసుస్టేషన్‌లో లంబాడాల ఐక్యవేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ నాయక్ ఫిర్యాదు చేశారు. సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ పవన్‌చంద్రకు సైతం వినతిపత్రం అందజేశారు.

ఆదిలాబాద్‌అర్బన్: సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, సాయి, పవన్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. విద్యార్థిని ర్యాగింగ్ పేరుతో మానసికంగా ఇబ్బందికి గురి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడే సురేష్, పీహెచ్‌సీ సిబ్బంది గంగామణి, శ్రీనివాస్, హిందుబాయి, పద్మ, కవిత, రుక్మాబాయి, నారాయణ, ప్రేంసింగ్ పాల్గొన్నారు.

నార్నూర్: వైద్య విద్యార్థి ప్రీతి మృతికి కారమైన వారిని కఠినంగా శిక్షించాలని లంబాడాల ఐక్యవేదిక సలహాదారుడు, టీజీయూఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆడే విశ్వనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో జాముడా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు సంతాపం ప్రకటించారు.

మైనార్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక



లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న ఎంపీపీ

నార్నూర్: లక్కీడ్రా పద్ధతి ద్వారా మైనార్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపికను సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన నిర్వహించినట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. లక్కీడ్రా ద్వారా మండల కేంద్రానికి చెందిన షేక్ తాజొద్దీన్, షేక్ హసీనా, షేక్ జహీర్‌లను ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యుడు దస్తగీర్, కనక ప్రభాకర్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు హాజరు కావాలి

గుడిహత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం రుణాలు అందించాలని ఇటీవల దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. మండల వ్యాప్తంగా 213 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వీరికి ఆయా బ్యాంకుల ద్వారా మార్చి 8న లబ్ధిదారుల ఎంపిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులతో పాటు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

నట్టల నివారణతో జీవాలు సురక్షితం



నట్టాల నివారణ మందు వేస్తున్న పశువైద్యాకారి

గుడిహత్నూర్: నట్టల నివారణ మందులతో మేకలు, గొర్రెలు సురక్షింతంగా ఉంటాయని మండల పశు వైద్యాధికారి జీవన్ అన్నారు. మండలంలోని శంభుగూడలో నిర్వహించిన నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయంతో పాటు రైతులు జీవాల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమ్ర శంభు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

తలమడుగు: గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీంపూర్, లల్‌ఘడ గ్రామాల్లో పశువైద్య శిబిరం నిర్వహించారు. మేకలకు, గొర్రెలకు నట్టాల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో గంగన్న, శంకర్, స్వామి, రాజు, సాయి, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే బాపురావుతో ఆదివాసీలు

బోథ్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బోథ్, సిరికొండ మండలాల ఆదివాసీ నాయకులు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని జీడిపల్లె, నేరడిపల్లె, పార్డి బి, టివిటి పల్లె, పరుపులపల్లె, సిరికొండ మండలంలోని ఫకీర్‌పేట్ ఆదివాసీలు, పటేల్‌లు, దేవరీలు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, ఐహితంగా ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఆదిలాబాద్

99516 02888

99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఆదిలాబాద్ : వి.రమేష్ - 8019715058

బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184

టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899